క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన


విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

సోమశిల: అనంతసాగరం మండల కేంద్రంలోని శాంతినికేతన్ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు విజయవాడ వరద బాధితుల కోసం రూ.2 లక్షలకు పైగా నగదు సేకరించి ఇచ్చారు. ఈ సందర్భంగా అపస్మా వారు పంపిన సర్టిఫికెట్లు, జ్ఞాపికలను మంగళవారం స్కూల్ ఆవరణలో విద్యార్థులకు ఎంఈఓ జానకిరాం, కెనరా బ్యాంక్ మేనేజర్ బితేష్‌కుమార్, బట్రెడ్డి జనార్దనరెడ్డి అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు స్కూల్ కరెస్పాండెంట్ ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్మీగీత మృతితో విషాదం


లక్ష్మీగీత (ఫైల్)

ఆత్మకూరు: ఒంగోలు ఎస్పీ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న ఆత్మకూరు మండలం నువ్వూరుపాడు గ్రామానికి చెందిన లక్ష్మీగీత (47) మంగళవారం నెల్లూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి వచ్చినప్పుడు అందరిని నవ్వుతూ పలకరించే లక్ష్మీగీత ఆకస్మిక మృతితో పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..


తీగలను తొలగించిన దృశ్యం

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు బస్టాండ్ వద్ద జాతీయ రహదారి పక్కన విద్యుత్ స్తంభాలకు పిచ్చిచెట్ల తీగలు అల్లుకు పోయాయి. దీనిపై సాక్షిలో మంగళవారం 'అల్లుకున్న నిర్లక్ష్యం' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి విద్యుత్ శాఖ అధికారులు తక్షణం స్పందించారు. స్థానిక లైన్‌మెన్ మద్దినేని రవితేజ పర్యవేక్షణలో తీగలు తొలగించారు.

విశ్వకర్మ జయంతి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మంగళవారం విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

- **ఆత్మకూరురూరల్:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విశ్వకర్మ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ సుధీర్, డీటీ రాజేష్, సీనియర్ అసిస్టెంట్ కొండయ్య, ఆర్ఐ పృథ్వీకుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం


మాట్లాడుతున్న ఎస్సై సైదులు

అనుమసముద్రంపేట: 'మండల కేంద్రంలో యువత గంజాయి మోజులో పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం' అని ఏఎస్‌పేట ఎస్సై సైదులు తెలిపారు. మంగళవారం ఆయన ఏఎస్‌పేటలోని పోలీస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కొంతమంది గంజాయి సరఫరా చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, పోలీస్ సిబ్బంది తనిఖీలను ముమ్మరం చేశారన్నారు. దొరసానమ్మతోటలోని ఓ భవనంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిందని, దీనిపై చర్యలు తీసుకుంటామన్నారు.

హక్కులు కల్పించాలంటూ..

ఉదయగిరి: మండలంలోని కుర్రపల్లి గ్రామానికి చెందిన పలువురు ఎస్సీలు తమకు కేటాయించిన మాదిగ మాన్యంపై హక్కులు కల్పించాలని తహసీల్దార్ ఎం.సుభద్రకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గుడిపాటి ఎర్ర వెంకటయ్య పేరు మీద పట్టా ఇచ్చారన్నారు. ఇటీవల పట్టాదారుడు చనిపోవడంతో ఆయన కుటుంబీకులు ఆ మాన్యంపై తమకు పూర్తి హక్కు ఉందంటూ దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. త్వరలో విచారణ చేసి న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

వింజమూరులో ర్యాలీ

వింజమూరు(ఉదయగిరి): స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి బంగ్లా సెంటర్ వరకు మంగళవారం స్వచ్ఛత హీ సేవా ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే సురేష్, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే బొమ్మరాజుచెరువులో పలువురు లబ్ధిదారులు పూర్తి చేసుకున్న పక్కాగృహాలను ప్రారంభించారు.

సంపద సృష్టి.. మాటలకే పరిమితం


సేకరించిన కూరగాయల వేస్ట్‌ను కంపోజ్ తొట్లలో పోశారిలా..


చెత్తను వేరుచేసి కంపోజ్ చేసిన అనంతరం తొట్లలో పేర్చారిలా..

- ఆత్మకూరు మున్సిపాలిటీలో వర్మీకంపోస్ట్ యూనిట్ మూత
- సిబ్బంది లేరంటూ అధికారుల సాకులు
- మొన్నటి వరకు రైతులకు ఎంతో ఉపయోగం

ఆత్మకూరు: చెత్త నుంచి సంపద సృష్టిస్తాం.. కొద్దిరోజులుగా కూటమి ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాట ఇది. ప్రధానంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అయితే దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎల్లో మీడియా ఊదరగొట్టింది. కానీ ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో వర్మీకంపోస్ట్ యూనిట్‌ను ఇటీవల మూసివేశారు. దీంతో మున్సిపల్ పరిధిలో సేకరించిన చెత్తను బైపాస్ రోడ్డులోని డంపింగ్ యార్డుకి తరలిస్తున్నారు. సాక్షాత్తు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నియోజకవర్గంలోనే ఈ పరిస్థితి నెలకొంది.

తయారీ ఎలా అంటే..

చెత్త నుంచి వర్మీకంపోస్ట్ ఎరువును తయారు చేసి మున్సిపల్ పరిధిలో ప్రజలకు విక్రయించి మున్సిపాలిటీకి అదనపు ఆదాయాన్ని అందించేందుకు పట్టణంలోని పాత ప్రభుత్వాస్పత్రి గదుల్లో కొన్ని సంవత్సరాల క్రితం వర్మీకంపోస్ట్ యూనిట్‌ను ప్రారంభించారు. సిమెంట్ బెడ్స్ (తొట్లు) ఏర్పాటు చేశారు. పట్టణంలో సేకరించిన కుళ్లిపోయిన పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తదితర తడిచెత్తను, ఇంకా పొడి చెత్తను సేకరించి వేరు చేసేవారు. కంపోజ్ చేసి డ్రై అయ్యాక బెడ్స్‌లో 45 రోజుల పాటు ఉంచేవారు. ఈ బెడ్స్‌పై వానపాములను వదిలి నిత్యం నీటి తడులతో చల్లబరిచేవారు. అనంతరం వర్మీకంపోస్ట్ తయారవుతుంది. జల్లెడ బట్టి సేకరించిన వర్మీకంపోస్ట్ ఎరువును కవర్లలో ప్యాక్ చేసి విక్రయించేవారు.

భారీగా కొనుగోలు చేసి..

కిలో రూ.5 చొప్పున నామమాత్రపు ధరకే మున్సిపల్ సిబ్బంది యూనిట్ వద్దనే విక్రయించడంతో పలువురు రైతులు తమ తోటలకు భారీగా కొనుగోలు చేసి తీసుకెళ్లేవారు. మహిళలు తమ గృహాల్లో పెంచుతున్న పూలమొక్కల కోసం ఎరువును కొనుగోలు చేసేవారు. ఇది ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. అయితే మున్సిపల్ అధికారులు బదిలీ అయిన క్రమంలో తగినంత సిబ్బంది లేరంటూ యూనిట్‌లో పనిచేసే కార్మికులను మున్సిపల్ పరిధిలో పనులకు తరలించారు. దీంతో యూనిట్ మూతపడింది. గతంలో తయారు చేసిన కంపోస్ట్ ఎరువు సైతం పూర్తిగా విక్రయించేశారు. ప్రజలు ఈ విషయం తెలియక పలుమార్లు అక్కడికి వెళ్లడం, మూసేసి ఉండడంతో తిరిగెళ్లిపోవడం పరిపాటిగా మారింది.

ఇదీ ఒక కారణం

పాత ప్రభుత్వాస్పత్రి వద్ద భవనంతోపాటు ఖాళీ స్థలం ఉండేది. ఈ నేపథ్యంలో సీనియర్ సివిల్ కోర్టు భవనాలు, వివిధ నిర్మాణాల కోసం స్థలం కేటాయించారు. అవి పూర్తవడంతో పాత భవనం వద్దకు చెత్తతో నిండిన మున్సిపల్ వాహనాలు రావడం కష్టమైందని అధికారులు చెబుతున్న మాట.

ఇలా చేస్తే..

మున్సిపల్ పరిధిలో సేకరించే టన్నుల కొద్దీ చెత్త నుంచి వర్మీకంపోస్ట్ ఎరువు తయారు చేసేందుకు యూనిట్ నిర్మించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం సేకరించిన చెత్తను బైపాస్‌రోడ్డులోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అందువల్ల అక్కడే ఉన్న మున్సిపల్ ఖాళీ స్థలంలో వర్మీకంపోస్ట్ యూనిట్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీని వల్ల కాలుష్యం తగ్గడంతోపాటు ప్రజలకు తక్కువ ధరకు ఎరువులు లభించడం, మున్సిపాలిటీకి అదనపు ఆదాయం చేకూరుతుందని చెబుతున్నారు.

పట్టణంలో వార్డులు	23
జనాభా : సుమారు	32 వేలకు పైగా..
రోజుకు పోగయ్యే చెత్త :	సుమారు 5 నుంచి 6 టన్నులు
చెత్త సేకరించే ట్రాక్టర్లు	4
మున్సిపల్ వ్యాన్లు	2
ఆటో	1
గార్బేజ్ వాహనం	1

మరోచోట యూనిట్ ఏర్పాటుకు కృషి

వర్మీకం పోస్ట్ యూనిట్‌లో ఎరువు తయారు చేయడం ఇటీవల నిలిపివేశారు. సిబ్బంది లేక ఆగింది. దీనికితోడు భవన వసతి పూర్తి స్థాయిలో అందుబాటులో లేదు. ఉన్నతాధికారులకు ఈ విషయాలు తెలియజేశాం. డంపింగ్ యార్డు వద్దనే ఎరువులు తయారు చేసే యూనిట్‌ను నెలకొల్పేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం.

– ఖాసీం, ఆర్ఐ, మున్సిపాలిటీ, ఆత్మకూరు

ఉపాధి పనులు కల్పించాలంటూ ఆందోళన


ఆందోళన చేస్తున్న మహిళా కూలీలు

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం గ్రామానికి చెందిన పలువురు ఉపాధి కూలీలు తమకు పనులు కల్పించాలంటూ మంగళవారం స్థానిక కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి పనులే తమకు జీవనాధారమని తెలిపారు. వారం రోజుల నుంచి పనులు కల్పించలేదని, ఈ విషయమై సిబ్బందిని అడిగితే పక్కాగృహాల నిర్మాణాలకు సంబంధించి మస్టర్లు వేస్తున్నామని చెప్పారన్నారు. తమకు పక్కాగృహాలే మంజూరు కాలేదని, మరి కూలీలు ఎలా వేస్తారని అధికారులను ప్రశ్నించారు. అనంతరం ఎంపీడీఓ ఈశ్వరమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు.

స్థలం కేటాయించాలని వినతి

దుత్తలూరు: మండల కేంద్రమైన దుత్తలూరు సెంటర్‌లో ఆంజనేయస్వామి గుడి నిర్మాణానికి స్థలం కేటాయించాలని తహసీల్దార్ వై.నాగనాజుకు మంగళవారం పలువురు వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు చుండి హరిగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను ఆయన కార్యాలయంలో కలిసి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా గుడిని తొలగించారని, నూతన నిర్మాణానికి రెవెన్యూ శాఖ చేత సర్వే చేయించి అనువైన ప్రాంతాన్ని కేటాయించాలని కోరారు.

జలదంకిలో రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న నేతలు

జలదంకి: పీఎం నరేంద్రమోదీ పుట్టినరోజు సందర్భంగా జలదంకిలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వద్ద బీజేపీ యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సహకారంతో మంగళవారం రక్తదాన శిబిరం జరిగింది. 26 మంది యువకులు రక్తదానం చేయగా వారికి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని పుట్టినరోజును పురస్కరించుకుని 15 రోజులపాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చల్లా హనుమారెడ్డి, బండారు తిరుపతిరెడ్డి, కిశోర్‌రెడ్డి, వంటేరు రాకేష్‌రెడ్డి, ఎం.వెంకట్రావు, సాయికృష్ణ, కమతం బాలకోటయ్య, జి.ప్రవీణ్‌కుమార్, శనివారపు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశపరీక్ష దరఖాస్తుల గడువు పొడిగింపు

మర్రిపాడు: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించే ప్రవేశపరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే గడువును సెప్టెంబర్ 23వ తేదీ వరకు పొడిగిస్తూ నవోదయ విద్యాలయ సమితి ఆదేశాలు జారీ చేసిందని మర్రిపాడు మండల కృష్ణాపురంలోని విద్యాలయం ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16వ తేదీతో గడువు ముగిసిందని, ఎక్కువ మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సమితి ఈ నిర్ణయం తీసుకుందని తెలియజేశారు. జిల్లాలోని 5వ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 89850 07588, 63004 29938 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

చర్యలు తీసుకోవాలని డిమాండ్

కావలి: పాము కాటుకు గురైన వ్యక్తికి సకాలంలో వైద్యం అందకపోవడంతో మృతిచెందాడని, ఈ విషయమై చర్యలు తీసుకోవాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. వారు, బాధిత కుటుంబసభ్యులు మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి మాట్లాడుతూ ఈనెల 2వ తేదీ బొచ్చు శంకరయ్య అనే వ్యక్తి పాము కాటుకు గురవగా వైద్యం కోసం కోవూరుపల్లె పీహెచ్‌సీకి తరలించారని చెప్పారు. సిబ్బంది ఒకటిన్నర గంటసేపు తలుపులు తీయలేదని, దీంతో శంకరయ్య మృతిచెందాడని వాపోయారు. వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్డీఓ శీనానాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ

- ఒకరి మృతి
- ఆస్తి వివాదమే కారణం


శ్రీనివాసులు మృతదేహం

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని బత్తినవారిపల్లిలో సోమవారం రాత్రి అన్నదమ్ముల మధ్య ఆస్తి విషయమై జరిగిన ఘర్షణలో అన్న బాబూరావు (35)కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు ఆయన్ను వింజమూరులోని ఓ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. ఆస్తి విషయమై బాబూరావుకు అతని అన్న శ్రీనివాసులుకు మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో అన్న శ్రీనివాసులుపై తమ్ముడు బాబూరావు దాడి చేశాడు. శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. సమీపంలోని వారు గొడవను ఆపారు. క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వీట్లు పంపిణీ

మర్రిపాడు: మండలంలోని చుంచులూరు గ్రామంలో షేక్ ఖాజావలీ అలియాస్ టోపి సాయిబు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి మిలాద్ ఉన్ నబీని నిర్వహించారు. ఖాజావలీ దాతృత్వంతో గ్రామస్తులకు స్వీట్లు పంపిణీ చేశారు. కలిశెట్టి రాజేంద్రకుమార్ తదితరులు కలిసి ఆయన్ను సన్మానించారు.

నగదు చోరీ

అల్లూరు: పోలేరమ్మ చెట్టు వద్ద హుండీలోని నగదును చోరీ చేసిన ఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికుల కథనం మేరకు.. అల్లూరు ఊరులోని పోలేరమ్మ చెట్టు వద్ద హుండీని గుర్తుతెలియని వ్యక్తి గడ్డపారతో పగులగొట్టి నగదు తీసుకున్నాడు. పక్కింటివారు చూసి అరవగా దొంగ పరారయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్సై కిశోర్‌బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కావలి: మండలంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జువ్విగుంటపాళెం గ్రామానికి చెందిన నెల్లూరు సుబ్బారావు (35) అనే వ్యక్తి మృతిచెందాడు. కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ జి.రాజేశ్వరరావు కథనం మేరకు.. సుబ్బారావు, మంచాల శ్రీకాంత్ కలిసి కావలికి బయలుదేరారు. శ్రీకాంత్ బైక్ నడుపుతుండగా సుబ్బారావు వెనుక కూర్చొన్నాడు. దారిలో తాళ్లపాళెం గ్రామం దాటిన తర్వాత మలుపు వద్ద లారీని డ్రైవర్ అతివేగంగా నడుపుతూ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో ఇద్దరూ కింద పడిపోయారు. సుబ్బారావు నడుముపై లారీ టైర్ ఎక్కడంతో అక్కడికక్కడే చనిపోయాడు. శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. సుబ్బారావుకు ఇద్దరు పిల్లలున్నారు. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీఎస్పీ బాధ్యతల స్వీకరణ


శ్రీధర్

కావలి: కావలి డీఎస్పీగా పి.శ్రీధర్ మంగళవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఈయన గతంలో నెల్లూరులోని మహిళా పోలీస్‌స్టేషన్, సీసీఎస్‌లో పనిచేశారు. రాయచోటి డీఎస్పీగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

వైఎస్సార్‌సీపీ నేత రమణారెడ్డి మృతి


రమణారెడ్డి (ఫైల్)

కలిగిరి: మండలంలోని తెల్లపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, కలిగిరి పీఏసీఎస్ మాజీ చైర్మన్ మార్నేళ్ల రమణారెడ్డి (78) అనారోగ్యంతో మంగళవారం మరణించారు. ఆయన మృతి పట్ల మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు.

ఓజోన్ పొర పరిరక్షణపై అవగాహన

ఉదయగిరి: మండలంలోని కృష్ణంపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు దారపనేని రమేష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గొడుగులు చేతపట్టి ఓజోన్ పొర భూగోళాన్ని ఎలా కాపాడుతుందో ప్రదర్శించారు. టీచర్లు జరీనా, సుధాకర్, ముజఫర్‌అలీ, పంచాయతీ కార్యదర్శి శిల్ప, వెల్ఫేర్ అసిస్టెంట్ నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

విద్యార్థుల ప్రతిభ


జ్యోతి

కావలి: స్థానిక డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14, 17 వాలీబాల్ పోటీల్లో కొత్తసత్రం ఉన్నత పాఠశాల జిల్లా తరఫున ఆడి ప్రతిభ చూపారు. వారిని మంగళవారం టీచర్లు, గ్రామస్తులు అభినందించారు. అండర్ 17లో రెండో స్థానం, 14లో మూడో స్థానం సాధించినట్లు హెచ్‌ఎం చెప్పారు.


ప్రతిభ చూపిన విద్యార్థులతో టీచర్లు తదితరులు

- కొత్తసత్రం ఉన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థిని ఎల్లంగారి జ్యోతి మహారాష్ట్రలో జరిగిన జాతీయ స్థాయి 'జంప్ రోప్ త్రీ మినిట్స్' పోటీల్లో మూడో స్థానం సాధించింది. దీంతో హెచ్‌ఎం కె.శ్రీనివాసులు, పీడీ మురళి అభినందించారు.

ఉపాధ్యాయులతో సమావేశం



ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నుంచి ఉర్దూ పాఠశాలల సముదాయ సమావేశాలు జరుగుతాయి. వీటికి సంబంధించి ముందస్తుగా మంగళవారం ఉపాధ్యాయులతో జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజామొహిద్దీన్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్ సమావేశాలు ఉపయోగించుకుని డివిజన్ పరిధిలోని ఉర్దూ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. స్థానికంగా లభించే తక్కువ ఖరీదు మెటీరియల్‌తో తయారు చేసిన బోధన అభ్యసనను పెంచాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం అనంతలక్ష్మి, ఆర్పీలు పాల్గొన్నారు.

నేడు, రేపు స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక

అనుమసముద్రంపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలకు ఎంపికలు బుధ, గురువారాల్లో జరుగుతాయని విద్యాశాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం అండర్ -14, 17 విభాగాల్లో కావలియడవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అథ్లెటిక్స్, యోగా, చెస్ పోటీలు నిర్వహిస్తామని తెలియజేశారు. గురువారం ఏఎస్‌పేట జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఏర్పాటు చేసి బాలబాలికల జట్లను ఎంపిక చేస్తామన్నారు. ఇతర వివరాలకు స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ వాసును 94915 39548 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

యువతికి వేధింపులు

- పోలీసుల అదుపులో వ్యక్తి

కావలి: పట్టణంలోని క్రిస్టియన్‌పేట ఆరో లైన్‌లో నివాసం ఉంటున్న ఓ కుటుంబానికి చెందిన యువతిని వేధిస్తున్న జక్కంపూడి సుబ్బానాయుడు అలియాస్ చింటూ అనే వ్యక్తిని మంగళవారం టు టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యువతి తల్లి ఫిర్యాదు చేయడంతో విచారణ చేస్తున్నట్లు సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా..


కలిగిరిలో ర్యాలీ

సాక్షి నెట్‌వర్క్: స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. స్వచ్ఛత హీ సేవాలో భాగంగా కావలి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు కలిసి ర్యాలీలు నిర్వహించారు. మానవహారాలు ఏర్పాటు చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఖాళీగా ఉన్న ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్లలో ఖాళీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ షేక్ గౌస్‌బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 27న ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్‌కు హాజరుకావాలన్నారు. 28న కౌన్సెలింగ్ జరుగుతుందని తెలియజేశారు.

'నులి'పేద్దాం

నులిపురుగులు.. ఇవి పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదలను నిరోధించి వారి పోషకాలను గ్రహించి శక్తిహీనులుగా మారుస్తాయి. ఆకలి మందగించడం, కడుపు నొప్పి, నీరసం తదితర సమస్యలు ఎదురవుతాయి. ఈ పరిస్థితికి ఆల్బెండజోల్ మాత్రలతో చెక్ పెట్టవచ్చని జాతీయ ఆరోగ్య సంస్థ చెబుతోంది. మంగళవారం కావలి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని విద్యాసంస్థల్లో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్యారోగ్య సిబ్బంది, విద్యాశాఖ అధికారులు, టీచర్లు విద్యార్థుల చేత మాత్రలను మింగించారు.

– సాక్షి నెట్‌వర్క్


మర్రిపాడులో..


కలిగిరి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థినికి మాత్ర వేస్తున్న సిబ్బంది


దుత్తలూరు హైస్కూల్లో..


వరికుంటపాడు మండలంలో..


సీతారామపురం కేజీబీవీలో..


ఏఎస్‌పేటలో..


ఆత్మకూరు మేదరవీధి ఎంపీపీ పాఠశాల వద్ద..